# వింత విశాలాక్షి

అద్దంపూడి అన్నపూర్ణమ్మగారు

విశాలాక్షికి యేది చూచినా భయమే, అందుచేత పిల్లలందరూ దాన్ని ఆడించేవారు. ఎలకనిచూస్తే భయం; పిల్లినిచూస్తేభయం; కుక్కనిచూస్తేభయం; చుంచునిచూస్తేభయం; చిమ్మెటనిచూస్తేకూడా భయం; అంతకంటేనూ బొద్దింకనుచూస్తే చాలా అపరిమితంగా భయం. బొద్దింకపేరుచెప్పితేనే హడలిపోయి, ఉన్నట్టుండి వులిక్కిపడును. పేరుచెప్పితేనే వులిక్కిపడినప్పుడు, దాన్ని చూస్తే యెంతభయమో మీాకే తెలియగలదు. దీపాలు పెట్టే సమయం అయిందంటే యెక్కడకూ ఒక్కర్తే వెళ్లదు. తనఇంట్లోనే ధారాళంగా మనం అంతా తిరిగేటట్టు తిరుగదు. విశాలాక్షి ఇంతభయపడుతుందని వాళ్ల ఇంట్లో అందరికీ అదిఅంటే పంచప్రాణాలూను. అయితే కొన్నియేళ్లువచ్చినా ఈ భయంపోలేదు గదా అని అప్పుడప్పుడు కసురుకుంటూ వుండేవారు.

విశాలాక్షికి సుమారు పాతికేళ్లుంటాయి. మంచి అందమయింది. పాటలూ పద్యాలూ కుట్టుపనులూ, మంచి చదువూ అన్నీవచ్చును. భారతభాగవతాలు అన్నీ గడగడ చదువుతుంది. ఆ చదివేటప్పుడు తడుముకోడం కూడా వుండదు. మంచి తెలివితేటలు గలది. ఎవళ్లు యేపనిచేసినా అది చూచి తక్షణం ఆపనిచేస్తుంది. అన్నింటిలోనూ తెలివితేటలేకాని, దానికున్న పిచ్చి ఈ బొద్దింకని చూస్తే భయపడడమే. విశాలాక్షి భర్తకి చాలా డబ్బూ, భూమీాపుట్రా అన్నీ వున్నాయి. ఆయనకూడా మంచిమనిషే. ఆయనపేరు గంగాధరరావు. విశాలాక్షి ఈ అల్పజంతువుల కన్నిటికీ భయపడుతుంది గదా అని అప్పుడప్పుడు మనస్సులో కష్టపడేవాడు.

విశాలాక్షి ఒక్కొక్కదినం పొద్దుపోక పక్కింటికి వెళ్లేది. అక్కడ కూచుని కాలక్షేపానికి యేహో మాట్లాడుకుంటూ వుండేవారు. ఆవిడకూ విశాలాక్షికీ చాలా స్నేహం. ఆవిడ పేరు రామమ్మ. ఎక్కడకేనా వెళ్లాలంటే ఇద్దరూ వెళ్లేవారు. రామమ్మకు పదేళ్లకూతురు ఒకత్తె వుంది; దానిపేరు పార్వతి. ఆ పిల్లకు పరిహాసం అంటే చాలాఇష్టం. విశాలాక్షిఅంటే దానికి చాలా ఆశ్చర్యం, అలక్ష్యమున్నూ. దాన్నిచూస్తేసరి అదుగో బొద్దింక, ఇదిగో బొద్దింక అని దాన్ని హడలపెడుతుంది. విశాలాక్షి నిజమే అనుకుని కూచున్న మనిషి లేచి బట్టంతా దులుపుకుని వెర్రిమొఖంపెట్టి "నే నింటికిపోతాను" అనును. అప్పుడు రామమ్మ పార్వతిని నాలుగూ తిట్టి దానిని అవతలకి పొమ్మనిచెప్పి విశాలాక్షితోటి "ఎందుకమ్మా నీకంతభయం, మేమంతా లేమా? నిన్ను మాత్రం అది మింగేసునా, లేకపోతే కరిచేసునా? ఏమిటి, ఇంకా చిన్నతనమేనా పాతికేళ్లొచ్చి? బొద్దింకని చూసి భయపడితే అంతా నవ్వరూ? పార్వతికీ నీకూ యెంత తేడా వుందో చూడూ! అదుగో బొద్దింక, ఇదిగో బొద్దింక అని అది అనడం, నువ్వు భయపడడమూనా?" అని అప్పుడప్పుడు కూకలేస్తూవుండేది. ఎవళ్ళెంత చెప్పినా యేం

చేసినా విశాలాక్షికి మాత్రం ఆ భయంపోలేదు. అది యేలాపోతుంది చిన్నప్పటినుంచీ వున్నది?

ఈలా వుంటూవుండగా గంగాధరరావు మేనమామ కొడుక్కి పెళ్ళొచ్చింది. ఆ పెళ్లికి గంగాధరరావునీ ఆయనభార్య విశాలాక్షినీకూడా తప్పకుండా రమ్మని జాబు వ్రాసినారు. అదికాక వాళ్లు స్వయంగాకూడావచ్చి పిలిచేరు. వెళ్లకపోతే యేలాతప్పతుంది? విశాలాక్షికి వెళ్లాలని లేదు. మరెందుకూకాదు, తనకున్న భయంవల్లనే. గంగాధరరావు వెళ్లకతప్పదన్నాడు. సరి అని యేలాగయితేనేమి, ప్రయాణం అయ్యేరు. విశాలాక్షి బట్టలన్నీ తనకూ ఆయనకూ పెట్టెల్లో సర్దింది. పెట్టుకునే నగలు పెట్టుకుంది. కొన్ని భద్రంగా పెట్టెలోపెట్టి దాచుకుంది. ఇంట్లో అన్నీ తాళాలువేసి బయలుదేరి నాలుగురోజులు పెళ్లుందనగానే వెళ్ళేరు.

గంగాధరరావు మేనమామపేరు వెంకట్రామయ్య. ఆయనకు ఒకేకొడుకు; లేకలేకపుట్టేడు. ఆయనకుకూడా చాలా డబ్బుంది. పెళ్లి చాలా బాగాచేద్దామని యేర్పాట్లుచేస్తూ వున్నాడు. ఆయనకు బంధువులు చాలామంది వున్నారు. బంధువులనందరినీ నాలుగురోజులు ముందరనే రమ్మనిచెప్పి వుత్తరాలు వ్రాయించారు. వెంకట్రామయ్య వున్నవూరు పెద్దపట్టణం. ఆయనఇల్లు పెద్దబంగాళా; దానిలో పెద్దతోట; ఆ తోటలో అన్నిరకాల పూవులూ వేసి చాలా బాగాపెంచేడు. అంత పెద్దఇల్లు వుండికూడా చాలదేమోఅని వాళ్లఇంటి పక్కనున్న ఇల్లు ఒకటికూడా పెళ్లికోసరం తీసుకున్నాడు. పెళ్లికి చుట్టాలందరూ వచ్చేరు. ఇల్లంతా రంగులతోటీ, పూవులతోటీ, కాగితపు బుట్టలతోటీ, పాదిరసపుగుండ్లతోటీ అలంకారం చేసేరు. రేపు పెళ్లిఅనగా ఈ వేళటికి రావలసిన చుట్టాలందరూవచ్చేరు. గంగాధరరావూ విశాలాక్షీకూడా వచ్చేరు. ఆ పెళ్లిల్లు చూడ్డానికి చాలా వినోదంగానూ, అద్భుతంగానూ కలకల్లాడుతూ వుంది. ఎంతచూచినా ఇంకాచూడాలని బుద్ధే గాని ఇవతలకు వద్దామన్నమాట వుండదు.

పెళ్లినాడు మేళాలు తాళాలు భోగంవాళ్లూ అందరూ వచ్చేరు. పెళ్లిఅయింది. ఆపెళ్లికి అందరూ శృంగారాలుచేసుకొని రకరకాలుగావచ్చేరు. ఆ వూరు వూరంతా వీళ్ల ఇంటికేవచ్చేరు. బ్రాహ్మలందరికీ కాసులూ అరకాసులూ వరహాలూ రూపాయలే కాని అంతకుతక్కువ సంభావనలు పంచిపెట్టలేదు. బీదలకందరికీ అన్నంపెట్టి గుడ్డలులేనివాళ్లకు గుడ్డలుఇచ్చి, "నాలుగురోజులూ మీరందరూ మాఇంటికేరండి" అని బీదలకందరికీ వంటవాళ్లనిపెట్టి వండించి నాలుగురోజులూ పప్పు పిండివంటలతోటి భోజనాలు పెట్టడానికి వెంకట్రామయ్య యేర్పాటు చేసేడు.

ఆపెళ్లి నాలుగు రోజులూ బంతులాడించేవాళ్లూ, నలుగులు పెట్టేవాళ్లు, పాటకచ్చేరీలుచూసేవాళ్లు, భోగం ఆటలు చూసేవాళ్లూ ఇలాగ ఆ వూరు వూరంతా వైభవంగా వుంది. వెంకట్రామయ్య కొడుక్కి పెళ్లి బాగాచేస్తున్నాడని వచ్చినవాళ్లందరూ పొగడుతూ వున్నారు.

విశాలాక్షీమాత్రం మధ్యాహ్నమంతా సందడిగానే తిరిగేది. సాయంకాలం ఆరుగంటలయేసరికి పదిమందీ యెక్కడవుంటే అక్కడేవుండి, వాళ్ల చుట్టుచుట్టూ తిరిగి ఈలాగేవుండేది. వాళ్లంతా వెడుతూవుంటే "నేనూ వస్తానుండండి" అని వాళ్ల వెనకనే వెళ్ళేది. అక్కడకూడా దీని శత్రువులే యెక్కువ. అక్కడక్కడ బొద్దింకలు ఇల్లంతా పాకుతూవుండేవి. రాత్రి పదిగంటలయేసరికి ఇల్లంతా యెగరడం ఆరంభించేవి. అప్పుడు విశాలాక్షికి గుండెల్లో ప్రాణంవుండేదికాదు. అక్కడెక్కడో యెగురుతూందంటే తెయ్యిమని గంతులేసేది. ఆ పెళ్లికొచ్చిన వాళ్లందరికీ ఇదొక వింతగా వుండేది. అక్కడ పాటలూ ఆటలూ వినేవారు కొందరూ, విశాలాక్షిని వేడుక చూసేవారు కొందరూ - ఇలాగుండేది. గంగాధరరావు దగ్గరకు వెళ్లి "నేను రానంటే రమ్మన్నారు." అని విసుక్కునేది విశాలాక్షి. "పెళ్లికొచ్చిందీ చాలు, నాఅవస్థాచాలు" అని వూరికే విచారపడేది. పాపం దానికి

రాత్రిఅంతా నిద్దర లేదు. ఒకపెద్దహాల్లో అందరూ ఒక చేపై అరవైమంది ఆడవాళ్లు పడుక్కునేవారు. వాళ్లందరి మధ్యకీపోయి పడుక్కునేది. ఆలాపడుక్కుంటె కూడా ఉండి ఉండి వులిక్కిపడేది. ఆ రీతిగా పెళ్లి నాలుగు రోజులూ గడిచేయి. అయిదోరోజు రాత్రికూడా రోజూ పడుక్కున్నట్టే విశాలాక్షి అందరిమధ్యనూ పడుక్కుంది. ఈ నాలుగురోజులూ నిద్రలేక పోయినందువల్ల ఆ వేళ పడుక్కున్న తోడనే నిద్దరట్టిపోయింది విశాలాక్షికి.

ఆ రాత్రి సుమారు ఒంటిగం టయివుంటుంది. అందరూ మంచినిద్దర్లు పోతూవున్నారు. "దొంగ, దొంగ" అని కేకలు వినపడ్డాయి. అందరూ గుంపులు గుంపులుగా లేచి పరుగెత్తేవాళ్లు, "పట్టుకోండి, పట్టుకోండి" అని కేక లేసేవాళ్లూ, పెట్టెలు తాళాలు తెరిచి చూసుకొనేవాళ్లు, కోట్లు వెతుక్కునేవాళ్లూ, చొక్కాలు వెతుక్కునే వాళ్లూ, జేబులు తడుముకొనేవాళ్లూ, వాళ్ల వాళ్ల డబ్బు సరిగా వుందా లేదా అని అడిగేవాళ్లూ, ఆడవాళ్లనూ పిల్లలనూ చూసుకొనేవాళ్లూ, వాళ్లనగలు సరిగా వున్నాయా లేదా అని అడిగేవాళ్లూ, ఈలా అల్లకల్లోలంగావుంది. పావుగంటయ్యేసరికి నగలూ, పెట్టెలూ యేమీ పోలేదు. అని తీర్మానం చేసుకొని "యేవేపునుంచి కేకలు వినపడ్డాయి?" అని అడిగి అందరూ విశాలాక్షి పడుకున్న హాలని తెలిసికొని, అక్కడకు ఆడవాళ్లూ మొగవాళ్లూ పిల్లలూ అందరూ పరుగెత్తుకొని వెడుతూవున్నారు. ఇక్కడ వున్నవాళ్లంతా "ఎందుకమ్మా?" అని అంటూ వున్నారు. అప్పుడు విశాలాక్షి తనపక్కనున్న ఒకఆమెను గట్టిగా పట్టుకొని "దొంగ, దొంగ" అని కళ్లుమూసుకొని కేక లేస్తూంది. ఆ పక్కనున్నావిడ "నేను కాదు మా అక్క, నేను కాదు మాఅక్క. నన్ను విడిచిపెట్టు. నా ప్రాణాలు పోతున్నాయి." అని కేక లేస్తూంది. వీళ్లిద్దరూ ఈవిధంగా కనబడ్డారు.

అక్కడ వున్నవాళ్లంతా ఇదేమి చెప్మామా అని ఆశ్చర్యపడిపోయి, "ఏమిటిది?" అని విశాలాక్షి పట్టుకున్నావిడను అడిగేరు. అడిగితే ఆవిడ "నేనుకాదు. మా అక్క" అని చెప్పింది.

చెప్పితే, "ఏమిటి మీ అక్క?" అని అడిగేరు అక్కడ వున్నవాళ్లంతాను.

"మా అక్క సుబ్బమ్మగారి అడ్డిగ దొంగిలించింది. కాని నేనుకాదు. నన్ను విడిచిపెట్టమనండి. మా అక్కను అడిగి ఇప్పిస్తాను." అన్నది.

అక్కడ అందరికీ ఆశ్చర్యం అయిపోయింది. ఆ సమయంలో సుబ్బమ్మ అక్కడనేవుంది కాబట్టి, "అవును, అవును. నా అడ్డిగపోయింది. తెల్లవారినుంచీ వెతికి, వెతికి అందరినీ అడిగి నా ప్రాణం విసిగిపోయింది. ఈ ముండా తీసిందీ" అని సుబ్బమ్మ అన్నది. సరి అని విశాలాక్షిని విడిచిపెట్టమని చెప్పినా ఇంకా విశాలాక్షి కళ్లుమూసుకునే కేకలేస్తూంది. అప్పుడు వాళ్లందరూ విశాలాక్షి చేతులు గట్టిగాలాగి కళ్లుతుడిచి "నీవు యేలాగు కనిపెట్టేవు, సుబ్బమ్మగారి అడ్డిగ ఈవిడ అక్క దొంగిలించిందని?" అని అందరూ కలసి విశాలాక్షిని అడిగేరు.

విశాలాక్షి "నాకేమీ తెలియదు. నాకు బొద్దింకలు యెగురుతూన్నట్టూనూ, అప్పుడు దొంగలొచ్చినట్టూనూ, కలొచ్చింది. ఆలాగ కలొస్తే నాకు భయంవేసి, యేమీ తోచక ఈవిడను గట్టిగాపట్టుకున్నాను.? కాని వేరేమీ నాకు తెలియదు." అని చెప్పింది. అప్పుడు సుబ్బమ్మ చాలా సంతోషపడింది. మిగత వాళ్లందరూ ఆశ్చర్యపడి, నిర్ఘాంతపడి చూస్తూవున్నారు.

